సాక్షి మెదక్

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



చల్లని పొదరిల్లు

మట్టిగోడలతో నిర్మితమైన అతి ఎత్తయిన పురాతన ఇళ్లు చల్లదనాన్ని పంచుతున్నాయి.

వివరాలు 8లో ▸



అయ్యో ట్రాన్స్‘ఫార్మర్లు’

రాయపోల్ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు హల్‌చల్ చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



రోడ్లపై ప్రయాణించేదెలా?

గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారి, నరకానికి దారులుగా మారుతున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వన దుర్గకు పోటెత్తిన భక్తులు



అమ్మవారి ఆలయంలో భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం ఆదివారం భక్త జనసంద్రంతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎండలు మండుతున్నా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి విచ్చేశారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఆలయ ఈఓ చంద్రశేఖర్, సిబ్బంది, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు.

ఎస్టీ డిగ్రీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు



ప్రిన్సిపాల్ ఫణికుమార్

కొడిపల్లి(నర్సాపూర్): ఎస్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డిగ్రీ బాలుర కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కొడిపల్లి ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలోని ఎస్టీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాలలో మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఎస్టీ, ఎస్సీ, బీసీ విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మూగజీవాల దాహార్తికి నీటి తొట్లు



నీటిని నింపుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నర్సాపూర్: వేసవిని దృష్టిలో పెట్టుకొని అడవి జంతువుల దాహం తీర్చేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ నీటి తొట్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌కు చెందిన సర్వ్ నీడి వాలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులు నర్సాపూర్ అడవిలోని మూగజీవాల దాహార్తిని తీర్చడానికి తమ వంతు ప్రయత్నానికి నడుం బిగించారు. ఇందులో భాగంగా ఆదివారం 15 నీటి తొట్లను అడవిలో ఏర్పాటు చేశారు. సంస్థ ప్రతినిధుల అభ్యర్థన మేరకు స్థానిక మున్సిపాలిటీ అధికారులు నీటి ట్యాంకర్లు సమకూర్చడంతో నీటితో నింపారు. కాగా రెండు మూడు రోజులకు ఒకసారి నీటి తొట్లను నింపుతామని సంస్థ ప్రతినిధి పవన్‌కళ్యాణ్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో అధికారులు తీవ్ర వివక్ష చూపుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారికంగా విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని, లేనిచో ప్రతిఘటన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు బాలరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము షేకులు, ప్రభాకర్, ప్రవీణ్, సంపత్ కుమార్, కుమార్, సిద్ది రాములు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్, రత్నయ్య, గోపాల్, గట్టయ్య పాల్గొన్నారు.

జడ్జి ప్రత్యేక పూజలు

హుస్నాబాద్: రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం హుస్నాబాద్ కోర్టు జడ్జి కృష్ణతేజ్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జడ్జిని అర్చకుడు పరమేశ్వర్ సన్మానించారు.

సర్కారు బడి.. సరికొత్త ఒరవడి

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు

- మే నెలంతా ప్రభుత్వ టీచర్లకు శిక్షణ
- ఆ తరువాతే బడిబాట షెడ్యూల్
- గతేడాది కంటే ఈసారి లక్ష్యం ఎక్కువ

మెదక్ జోన్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని, మీ పిల్లలను ప్రైవేట్‌కు పంపించకుండా సర్కారు బడుల్లోనే చదివించాలని ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు నచ్చజెబుతున్నారు. ప్రచారంలో ఆలస్యమైతే ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు విద్యార్థులను తీసుకెళ్లి ఎక్కడ చేర్చుకుంటారోనని తొందర పడుతున్నారు. ఇప్పటికే రామాయంపేట మండలం డి ధర్మారంలో, నార్సింగ్ మండలం శేరిపల్లిలో ముందస్తుగా బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 1,006 ఉండగా వాటిలో 1.22 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వాటిలో 628 ప్రాథమిక పాఠశాలలు, 128 ప్రాథమికోన్నత పాఠశాలలు, 146 ఉన్నత పాఠశాలలు కాగా 27 గురుకులాలు, 19 కేజీబీవీలు, 7 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రభుత్వ సెక్టార్ బడుల్లో మొత్తం 95 వేల మంది విద్యార్థులు చదువుకుంటుండగా, ప్రైవేట్ పాఠశాలలు 101 ఉన్నాయి. వాటిలో 27 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా వేసవి సెలవులు రాగానే ప్రతి ఏటా ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు కరపత్రాలు ముద్రించి వారి సిబ్బందిని గ్రామాల్లో తిప్పుతూ మా స్కూలుకే పిల్లలను పంపించాలని ప్రచారం చేసేవారు. కానీ ఈసారి ప్రైవేట్ స్కూళ్ల ప్రచారం కన్న ముందే ప్రభుత్వం అప్రమత్తమైంది. సర్కారు బడుల్లోనే చేర్పించాలంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందస్తుగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ధర్మారంలో ముందస్తు బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

శిక్షణ తరువాతే బడిబాట షెడ్యూల్

మే నెలలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం బడిబాట షెడ్యూల్ వస్తుందని ఉన్నతాధికారి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన ఏ విధంగా అందించాలి? ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో ఆంగ్లంలో బోధన కొనసాగాలని ఈ శిక్షణలో ప్రధాన అంశంగా పేర్కొన్నారు. మే మొదటి వారంలో రాష్ట్ర స్థాయిలో, రెండో వారంలో జిల్లా స్థాయి, మూడో వారంలో మండల స్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఒక్కో ఉపాధ్యాయుడికి 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు విధిగా పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

కలెక్టర్ ప్రచారం

గత సంవత్సరం బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ ప్రత్యేక చొరవ చూపారు. బడిబాటపై ఆయన ప్రత్యేకంగా పాట కూడా రాశారు. అప్పట్లో ఆ పాట సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రోల్ అయింది. అంతేకాకుండా నర్సాపూర్ మండలంలోని మారుమూల గ్రామంలో రాత్రి అక్కడే బస చేసి, ఉదయం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందిస్తారని చెప్పారు. ఉచితంగా బుక్స్, యూనిఫాంలు ఇస్తారని, ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించారు. దీంతో గత సంవత్సరం 6,200 మంది విద్యార్థులు బడిలో చేరారు.

గతేడాది కంటే ఎక్కువ



గత సంవత్సరం బడిబాటలో భాగంగా 6,200 మంది విద్యార్థులను బడిలో చేర్పించాం. ఈ ఏడాది అంతకన్న ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించాలని టార్గెట్ పెట్టుకున్నాం. ముందస్తుగానే బుక్స్, యూనిఫాంలు అందిస్తాం. అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం కొనసాగుతుంది. సర్కారు పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు అన్ని రకాల అర్హతలున్నాయనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తుపెట్టుకోవాలి.

– రాధాకిషన్, డీఈఓ, మెదక్

బీఆర్‌ఎస్ వెంటే ప్రజలు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



బీఆర్‌ఎస్ జెండాను ఎగుర వేసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

నర్సాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ వెంటే ప్రజలు ఉన్నారని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ రజతోత్సవాన్ని పురస్కరించుకొని నాయకులతో కలిసి స్థానిక చౌరస్తాలో గులాబీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్‌లో చేపట్టిన రజతోత్సవ సభకు నాయకులు, ప్రజలు గ్రామాల నుంచి తమ అంచనాలకు మించి వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఇంకా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులను మర్చిపోలేదన్నారు. ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ ఆయన పాలన రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే పక్కనే ఉన్న హోటల్‌లో నాయకులతో కలిసి చాయ్ తాగుతూ సభకు వస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, గోపి, సంతోష్‌రెడ్డి, శేఖర్, అశోక్‌గౌడ్, నయిమొద్దీన్, భిక్షపతి, బాల్‌రెడ్డి, ప్రసాద్, జ్ఞానేశ్వర్, నర్సింహులు, రాకేశ్‌గౌడ్, నాగరాజుగౌడ్, శ్రవన్, శివకుమార్, షేక్ హుస్సేన్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో పదేళ్ల పాలన

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి



మెదక్ పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ఎన్నో సమస్యలను పరిష్కరించి ప్రజల గుండెల్లో నిలిచిందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి పేర్కొన్నారు. రజతోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మెదక్ పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది అమరులయ్యారని వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాలని ఉద్యమ నేత, రథసారథి కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను స్థాపించారని తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటంతో లక్ష్యం నెరవేరిందని, రాష్ట్రం సిద్ధించాక కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమైందన్నారు. అనంతరం మెదక్ నుంచి వరంగల్ ఎల్కతుర్తిలో జరుగుతున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లారు. అంతకు ముందు పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్లు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు జగపతి, కృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

‘భగీరథ’ పైపులైన్ లీకేజీ

- వృథాగా పోతున్న తాగునీరు
- మూడు రోజులుగా పలు గ్రామాలకు నీటి కష్టాలు
- పట్టించుకోని అధికారులు



నార్సింగి శివారులో మిషన్ భగీరథ పైపులు పగిలి వృథాగా పోతున్న నీరు

పాపన్నపేట(మెదక్): మిషన్ భగీరథ పైపులైన్ జాయింట్ విడిపోవడంతో ఆదివారం నీరు వృథాగా పోయింది. సుమారు 20 ఎకరాల పొలాల్లోకి నీరు చేరింది. మండల పరిధిలోని నార్సింగి గ్రామానికి చెందిన 70 కుటుంబాలతోపాటు పలు గ్రామాలకు తాగునీరు రావడం లేదు. గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు కొత్తగా లింక్ లైన్ ఏర్పాటు చేసి, అర్కెల, దాని పరిధిలోని ఏడు గిరిజన తండాలు, నార్సింగిలోని ఒక ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చి తాగునీరందిస్తున్నారు. అయితే మూడు రోజులుగా నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫోన్ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నార్సింగి గ్రామ శివారులో పైపులు పగిలి నీరు వృథాగా పోతుందని తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం



పెద్దశంకరంపేటలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం వరంగల్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, సభకు వెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభించి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు. సభకు తరలిన వారిలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ వైస్‌ఎంపీపీ లక్ష్మీరమేశ్, సురేశ్‌గౌడ్, సుభాష్ తదితరులున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ప్రజ్ఞాపూర్‌లోగల టీజీడబ్ల్యూఆర్‌ఎస్(వర్గల్) విద్యార్థి బి.ఆకాష్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. టీజీడబ్ల్యూఆర్‌ఎస్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆకాష్ ఈనెల 30 నుంచి మే 5వరకు ఢిల్లీలో జరిగే అండర్ -19 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చాటి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

పహల్గాం మృతుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు



చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

మెదక్ జోన్: పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మ శాంతి కోసం ఆదివారం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత గురువులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు పర్యాయాలుగా ప్రార్థనలు నిర్వహించి భక్తులను ఉద్దేశించి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశమిచ్చారు.

డోర్లు బిగించారు.. నిర్వహణ మరిచారు

- రైతువేదికలో నిరుపయోగంగా మరుగుదొడ్లు
- వ్యవసాయ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం



డోర్లు బిగించి తాళాలు వేసిన అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): జిల్లా కలెక్టర్ వస్తున్నాడనే హడావిడితో మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో వినియోగంలో లేని మరుగుదొడ్లకు వ్యవసాయ అధికారులు డోర్లు బిగించి చేతులు దులుపుకున్నారు. ఈ నెల 25న భూ భారతి కార్యక్రమం రైతువేదికలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరయ్యారు. దీంతో హడావిడిగా వ్యవసాయ శాఖ అధికారులు అపరిశుభ్రంగా ఉన్న వాటికి డోర్లు బిగించి తాళాలు వేసి వదిలివేశారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మిస్తే కేవలం నీరు లేదనే సాకుతో ఇలా నిర్లక్ష్యంగా వదిలివేస్తే ఎలా అని, మౌలిక వసతులు కల్పించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఏవో కార్యాలయం ప్రైవేటు భవనంలో కొనసాగగా.. అద్దె చెల్లించలేక హవేళిఘణాపూర్ రైతువేదికకు మార్చారు. అధికారులు కనీసం మరుగుదొడ్లను బాగు చేయించుకొని వినియోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్రామాకేర్ ఏర్పాటయ్యేనా?

- రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు అందని వైద్యసేవలు
- సెంటర్ లేకపోవడంతో మృత్యువాత పడుతున్న వైనం
- రామాయంపేట, తూప్రాన్‌లో ఏర్పాటుకు ప్రతిపాదనలు



రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రి భవనం

రామాయంపేట(మెదక్): జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో గాయాలపాలైన వారికి సత్వరమే వైద్యసేవలు అందించడానికి గతంలో పలు జిల్లాల్లో ప్రత్యేకంగా ట్రామాకేర్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలో ఒకటి కూడా లేకపోవడంతో క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందక మృతి చెందుతున్నారు. పొరుగున ఉన్న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఉంది. ఈ జిల్లా సరిహద్దులో ఉన్న రామాయంపేట, తూప్రాన్‌లో కూడా సెంటర్లు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెంటర్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

జిల్లాలో ఒక్కటి కూడా లేదు

జిల్లాలో 55 కిలోమీటర్ల మేర 44వ జాతీయ రహదారి విస్తరించి ఉండగా.. ఒక్క ట్రామాకేర్ సెంటర్ కూడా లేదు. ఈ రహదారి పై ప్రతి రోజు కనీసం నాలుగైదు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గాయపడ్డవారికి సకాలంలో వైద్య సేవలు అందితే వారు బతుకుతారు. జాతీయ రహదారిపై ఉన్న తూప్రాన్, రామాయంపేటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. కానీ అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు వైద్య సేవలందించడానికి నిష్ణాతులైన డాక్టర్లు, మందులు, ఇతర వసతులు, అంబులెన్సు సదుపాయం లేదు. దీంతో ప్రైవేట్ అంబులెన్సుల్లో వేల ఖర్చుతో హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించాలంటే కనీసం రెండు గంటల సమయం పడుతుండటంతో క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు. రామాయంపేట, తూప్రాన్‌లో సెంటర్ల ఏర్పాటుకు ఖాళీగా ఉన్న అధునాతన భవనాలు అనుకూలంగా ఉన్నాయి. ఇప్పటికే ఏర్పాటుకు ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. త్వరలో మంజూరు కానున్నట్లు సమాచారం. ఈ కేంద్రాలు మంజూరైతే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

ఏర్పాటైతే అందే వైద్య సేవలివి..

- ట్రామాకేర్ సెంటర్‌లో 24 గంటలూ అత్యవసర వైద్య సేవలు అందుతాయి.
- రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారికి తక్షణమే చికిత్స అందిస్తారు.
- ఐసీయూ సదుపాయంతోపాటు క్షతగాత్రులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.
- చికిత్స నిమిత్తం అధునాతన పరికరాలు, మందులు ఉంటాయి.
- అత్యవసర చికిత్స నిర్వహించడానికి వీలుగా ఆపరేషన్ థియేటర్, బ్లడ్ బ్యాంక్, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- ఎక్స్‌రే, సీటీస్కాన్, అల్ట్రాసౌండ్ వంటి అధునాతన రేడియాలజీ సేవలు అందుతాయి.
- న్యూరో సర్జన్, ఆర్థో సర్జన్, మత్తు డాక్టర్, ఇతర స్పెషలిస్టులు ఉంటారు.
- కేంద్రాలకు అంబులెన్స్ ఉంటుంది.
- అదనంగా డాక్టర్లు, వివిధ విభాగాల్లో నిపుణులు, నర్సులను ఏర్పాటు చేస్తారు.
- సెంటర్ ఏర్పాటైతే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి.

ప్రతిపాదనలు పంపించాం..



రామాయంపేట, తూప్రాన్‌లో ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు అత్యవసరం. రెండు చోట్ల భవన సదుపాయం కూడా ఉంది. ఇక్కడ కేంద్రాలు ఏర్పాటు చేస్తే అదనంగా మందులతో పాటు నిపుణలైన డాక్టర్లు, ఇతర సిబ్బంది, అదనంగా పోస్టులు మంజూరవుతాయి. క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందుతాయి. దీంతో మరణాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాం.

–డాక్టర్ శ్రీరాం, జిల్లా వైద్యాధికారి

క్లుప్తంగా

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

నర్సాపూర్ రూరల్: చిన్నచింతకుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై లింగం ఆదివారం తెలిపారు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని బైక్‌పై నుంచి రోడ్డుపై పడిన ముగ్గురిపై నుంచి లారీ దూసుకెళ్లిన సంగతి విదితమే. ఈ ప్రమాదంలో కొడిపల్లి మండలం వెంకట్రావుపేటకు మాల గోపాల్ అతడి కుమారుడు అనుదీప్, తోడళ్లుడు కూతురు సహస్ర మృతి చెందారు. వీరికి మృతికి కారణమైన సూర్యాపేటకు చెందిన లారీ డ్రైవర్ చంద్రబాబును అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గడ్డి మోపులు దగ్ధం



కాలిపోతున్న గడ్డి మోపులు

నర్సాపూర్ రూరల్: గడ్డి మోపులతో వెళ్తున్న ట్రాక్టర్‌కు మంటలు అంటుకున్న ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బ్రాహ్మణపల్లి గిరిజన తండాకు చెందిన రమేశ్ నాయక్ ట్రాక్టర్‌లో గడ్డి మోపులను లోడ్ చేసుకొని గ్రామంలోకి వస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అంటుకున్నాయి. రమేశ్ నాయక్ చాకచక్యంగా వ్యవహరించి ట్రాలీ హైడ్రాలిక్ లేపడంతో కాలుతున్న గడ్డిమోపులు రోడ్డుపై పడ్డాయి. దీంతో బ్రాహ్మణపల్లి రోడ్డులో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. గడ్డిమోపులు కాలిపోవడంతో సుమారు రూ.10 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మొగుడంపల్లి మండలం గుడ్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గుడ్‌పల్లికి చెందిన వడ్డె నాగన్న (55) రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కరెంట్ సరఫరా జరగడంలేదని సర్వీస్ వైర్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టి కింద పడిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిరాగ్‌పల్లి పోలీసులు గ్రామాన్ని సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన తుఫాన్ వాహనం

- కూలి పనులకు వెళ్లొస్తూ ఇద్దరు మృతి



సారయ్య మృతదేహం

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం నంగునూరు మండల రాంపూర్ క్రాస్‌రోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన తాడెం సారయ్య (36), అదే గ్రామానికి చెందిన బండోజు గణేశ్ సిద్దిపేటలో కూలి పనులు ముగించుకొని రాత్రి మోటర్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలు దేరారు. ఇదే సమయంలో వరంగల్ మీటింగ్‌కు నుంచి సిద్దిపేట వైపునకు తుఫాన్ వాహనం వెళ్తుంది. మార్గమధ్యలో రాంపూర్ క్రాస్ వద్దకి రాగానే తుఫాన్ వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సారయ్య అక్కడికక్కడే మృతి చెందగా, గణేశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడు రమేశ్‌ను రాజపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను పోలీస్ వాహనంలో సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అంబులెన్స్‌కు దారి



అంబులెన్స్ ముందు బారికేడ్లను తొలగిస్తున్న యువకులు

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా ఆదివారం రంగదాంపల్లి అమరవీరుల స్థూపం చౌరస్తా వద్ద ఎల్కతుర్తికి వెళ్లే వాహనాలతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న అంబులెన్స్ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంది. దీంతో అక్కడ ఉన్న బీఆర్‌ఎస్ యువ కార్యకర్తలు రోడ్డుకు అడ్డంగా ఉన్న బారీ కేడ్లను తొలగించి, దారి ఇవ్వండి అని వాహనాలకు చెబుతూ అంబులెన్స్ వెళ్లేలా చేశారు. అక్కడ ఉన్న వారు అందరూ యువకులను అభినందించారు.

– ఫోటో : సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, సిద్దిపేట

చల్లని పొదరిల్లు

మండు వేసవిలోనూ కూల్ కూల్..
- చెక్కు చెదరని గడీల ఇల్లు, పెంకుటిళ్లు
- తాతల కాలం నాటి ఇళ్లను కాపాడుకుంటున్న వారసులు
- సీజన్ ఏదైనా ఆహ్లాదకరం
- పర్యావరణహితం.. పాతకాలం నాటి భవనం

ఎండలు మండిపోతున్నాయి.. సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు.. వేడిమిని తట్టుకోలేక జనం అల్లాడిపోతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావడం లేదు.. చాలా మంది ఇంట్లోనే ఉంటూ ఏసీలు, కూలర్లు వాడుతూ చల్లదనాన్ని పొందుతున్నారు. ఇవి ఎంత వాడినా న్యాచురల్‌గా వచ్చే గాలి వేరు. ప్రస్తుతం కొన్ని ఇళ్లు ఎంత ఎండ కొట్టినా చల్లదనాన్ని పంచుతున్నాయి. మట్టి గోడలతో నిర్మితమైన అతి పురాతన ఇళ్లు, ఇంటి పైకప్పులో పేర్చిన కలప, చెక్క వంటి వాటితో ఇళ్లు ఎల్లప్పుడూ చల్లగా ఉంటుంది. పెంకుటిళ్లు కూడా ఎన్నేళ్లు అయినా చెక్కు చెదరకుండా కూల్‌గా ఉంటాయి. కొందరైతే తాతల కాలం నుంచి వచ్చిన ఇళ్లను రూ.లక్షలు ఖర్చు చేసి మోడ్రన్ ఇల్లుగా మార్చుతున్నారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండి ఎలాంటి వాతావరణంలోనైనా చల్లదనాన్ని పంచే ఇళ్లపై ప్రత్యేక కథనం..

పర్యావరణ హితం.. ఆ ఇల్లు



కొండం లక్ష్మారెడ్డి, ఇంటి యజమాని

చిన్నకోడూరు(సిద్దిపేట): పర్యావరణ హితం.. వాతావరణ అనుకూలం లక్ష్యంగా మట్టి, ఇసుక, సిమెంట్, డంగ్ సున్నంతో కలిసి చేసిన ఇంటి నిర్మాణం ఆహ్లాదాన్ని అందిస్తుంది. మండు టెండలో సైతం చల్లదనాన్ని ఇస్తుంది. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన కొండం లక్ష్మారెడ్డి రిటైర్డ్ ఉద్యోగి. తన ఇంటిని వినూత్న రీతిలో నిర్మించారు. కేరళ ప్రాంతంలో అధికంగా ఇలాంటి ఇళ్ల నిర్మాణాలు ఉంటాయి. తెలంగాణలో మొదటి సారిగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ ఇళ్లు ఏడాది కాలం పాటు వర్షాకాల, శీతాకాల, వేసవికాలాలకు అనుగుణంగా ఉంటుంది. తక్కువ డబ్బులతో వాతావరణ, వాయుకాలుష్యం నుంచి రక్షణ కలిపిస్తుంది. ఏసీలు, కూలర్‌లు అవసరం లేదు. ఆరోగ్య పరంగా ఇంటి నిర్మాణం బహుళ ప్రయోజనం.



మట్టి, ఇసుక, డంగ్ సున్నం, సిమెంట్‌తో నిర్మించిన ఇల్లు



మోడ్రన్ పెంకుటిల్లు

సొబగులు అద్ది.. చల్లగా తీర్చిదిద్ది

రూ.లక్షలు వెచ్చించి ఇంటిని పునర్నిర్మాణం



చెక్కతో కూడిన దర్వాజ

సిద్దిపేటరూరల్: ఎండాకాలం పెంకుటిల్లును మించిన చల్లదనం ఉండదు. ఇలాంటి క్రమంలో ఎంతమంచి బిల్డింగ్ కట్టుకున్నా ఎండాకాలం వేడిని నుంచి సాధారణ ఉపశమనం పొందడం వీలుకాదు. అలాంటి ఇబ్బందులను తొలగించుకుంటూ చిన్నగుండవెళ్లి గ్రామానికి చెందిన కోటగిరి యాదగిరి గౌడ్, కొత్తపల్లి చంద్రం పాత ఇల్లునే అందంగా నిర్మించుకొని మోడ్రన్ పెంకుటిల్లుగా మార్చుకున్నారు. బయట నుంచి చూస్తే పెంకుటిల్లు మాత్రమే కాని లోపికి వెళ్లి చూస్తే ఇంద్రభవనం, బిల్డింగ్ వంటి అనుభూతిని పొందేలా అధునాతన పద్ధతిలో నిర్మించుకున్నారు. తన తాతలు, తండ్రుల నుంచి వచ్చిన ఇల్లు కాబట్టి దానిని కూల్చేందుకు మనసు రాక రూ.40 లక్షలకు పైగా వెచ్చించి మోడ్రన్ ఇంటిని నిర్మించారు. చల్లని గాని, వెలుతురు వచ్చేలా విశాలమైన గదులు, బెంగుళూరు పెంకులు, టేకు కర్రతో, అందమైన కళాకృతులతో తలుపులు బిగించారు. ప్రస్తుతానికి ఇల్లు పెంకుటిల్లా.. భవంతి ఇల్లా అన్నట్లుగా చూపరులను ఆకర్శిస్తుంది. ఎండాకాలం అయినా చల్లని వాతావరణం కలిగి ఉండడం విశేషం.

86 ఏళ్లుగా.. రండా



ఎత్తుగా నిర్మించిన పెంకుటిల్లు

కొండపాక(గజ్వేల్): ఎండ వేడమి, చలి తీవ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు సుమారు 86 ఏళ్ల కిందట డంగ్ సున్నంతో చాలా ఎత్తుగా మట్టి గోడలతో పెంకుటింటిని నిర్మించారు మర్పడ్గ గ్రామానికి చెందిన చీకోటి భద్రి నారాయణ. ప్రస్తుతం ఉన్న ఎండలకు ఏసీలు, కూలర్లు చేయని పనిని ఎత్తుగా నిర్మించిన ఇంటితో పొందుతున్నారు. ఎండా కాలంలో చల్లదనం, చలి కాలం వెచ్చదనంగా ఉంటుంది. కోతులతో పెంకులు దెబ్బతింటున్నప్పటికీ రెండు సీజన్లకు చాలా ఉపయోగకరంగా ఉంటుండటంతో పెంకులను సరి చేయిస్తున్నారు. నిర్మాణం చేపట్టిన నుంచి ఆ ఇంట్లోనే కుటుంబీకులందరూ నివాసం ఉంటున్నారు.

ఎన్నేళ్లు 'గడీ'చినా చెదరని ఇల్లు



గడీల ఇల్లు



టేకుతో వేసిన పైకప్పు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మండు వేసవిలో చల్లదనం పంచుతుంది దొర వారి గడీల ఇల్లు. సుమారు 400 ఏళ్ల కిందట మర్పడగ గోపాల్ రెడ్డి అనే దొర ఎకరం స్థలంలో ఈ గడిని కేవలం సుమారు రూ. 500తో నిర్మించినట్లు ఆయన వారసత్వంగా వస్తున్న కుటుంబ సభ్యులు చెప్పారు. మీటర్ వెడల్పు గోడల మందంతో ఒక అంతస్తు వరకు మట్టి ముద్దలతో గోడలను నిర్మించారు. పై కప్పులో మొత్తం విలువైన టేకు దూలాలతో పాటు కలపను పేర్చారు. కలపపై వేప ఆకులను పరిచి వాటిపై అర పీట్ మందంతో మట్టిని అమర్చారు. మట్టిపై నుంచి కుమ్మరి గూన పెంకులతో కప్పేశారు. దీంతో ఎంతటి వేసవి కాలం అయినా చల్లగానూ, మరీ ఎంతటి చలి, వర్షాకాలం అయినా వెచ్చగా ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఎకరం స్థలంలో నిర్మించిన ఆ ఇంటిలో ఆరు కుటుంబాలు నివసించేలా గదులను నిర్మించారు. ఏసీలు లేకున్నా చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నట్లు ప్రస్తుతం ఆ ఇంటిలో నివసిస్తున్న శశిరేఖా దేవి, లక్ష్మీ నర్సమ్మ, శ్రీమతి, నిర్మల వెల్లడిస్తున్నారు. తమ పిల్లలు హైదబాద్‌లో స్థిరపడ్డారని, ప్రతీ వేసవి సెలవుల్లో తమ మనవళ్లు, మనవరాళ్లను ఇక్కడికి తీసుకొచ్చి వేసవి అయిపోయే ఇక్కడే ఉంటారని తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో తమ కుటుంబ సభ్యులు రానున్నారని, వారితో ఈ ఇంటి చల్లదనాన్ని ఆస్వాదిస్తామని చెప్పుకొచ్చారు.

గోడలు చెక్కు చెదరలేదు



సుమారు 400 ఏళ్ల కిందట నిర్మించినట్లు చెప్ప బడుతున్న ఈ గడిలోని ప్రతీ గోడ ఇప్పటి వరకు చెక్కు చెదరలేదు. గోడలు మీటర్ వెడల్పుతో ఒక అంతస్తు వరకు ఎత్తుగా కట్టడంతోపాటు, పై కప్పు మొత్తం టేకు కలపను వినియోగించడంతో ఎండాకాలంలో చల్లగా ఉంటుంది. వృద్ధాప్యంలో మాకు చాలా ఉపశమనంగా ఉంటుంది.

– శశిరేఖ, లక్ష్మీ నర్సమ్మ, శ్రీమతి, ఇంటి కుటుంబ సభ్యులు

కుక్కను తప్పించబోయి.. మృత్యుఒడికి

బైక్ అదుపుతప్పి పడిపోవడంతో వ్యక్తి మృతి



ఎల్లం(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి శివారులో చోటు చేసుకుంది. పేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండలంలోని మడూర్ గ్రామానికి చెందిన సందిగల్ల ఎల్లం(48) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం మడూర్ నుంచి మెదక్ బయలుదేరిన ఎల్లం గవ్వలపల్లి దాటిన తర్వాత మెదక్ రోడ్డుపై కుక్క అడ్డుగా రావడంతో తప్పించేందుకు ప్రయత్నించాడు. బైక్ అదుపుతప్పి పడిపోవడంతో గాయాలు అయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

మహిళ మృతి, ముగ్గురికి గాయాలు



అమృత మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): బైక్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలం దేవులపల్లి గ్రామ శివారులో దౌల్తాబాద్ హత్నూర రోడ్డుపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ కథనం మేరకు.. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం అజమర్రి గ్రామానికి చెందిన అమృత, కుమారుడు కృపాకర్, కోడలు అనూష, రెండేళ్ల మనవరాలుతో కలిసి కుమారుడి బైక్‌పై దౌల్తాబాద్ వైపు వెళ్తున్నారు. దేవులపల్లి శివారులోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అమృత(45) అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడు కృపాకర్, కోడలు అనూష, రెండేళ్ల మనవరాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- బస్సును ఢీకొట్టిన కారు



శ్రావణ్‌కుమార్(ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

శివ్వంపేట(నర్సాపూర్) : రెండు రోజుల్లో పెళ్లి జరగాల్సిన ఆ ఇంట విషాదం నెలకొంది. బావ పెళ్లికి బట్టలు కొనుక్కొని కారులో డ్రైవింగ్ చేసుకుంటూ వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన రాగుల శ్రావణ్‌కుమార్(20) తన బావ శివకుమార్ పెళ్లి రెండు రోజుల్లో ఉండటంతో తూప్రాన్ లో బట్టలు కొనుగోలు చేసేందుకు కారులో బయలుదేరాడు. బట్టలు కొన్న అనంతరం కారులో నల్లవల్లికి బయలుదేరాడు. తూప్రాన్- నర్సాపూర్ హైవేపై మార్గమధ్యలో శభాస్‌పల్లి గ్రామ శివారులో సంగారెడ్డి నుంచి గజ్వేల్ వైపునకు వస్తున్న ఆర్‌టీసీ అద్దె బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రావణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. 10 రోజుల కిందట నల్లవల్లి గ్రామానికి చెందిన వ్యక్తే ఇదే ప్రదేశంలో ఆర్‌టీసీ బస్సు ఢీకొని మృతి చెందాడు. ఈ రెండు ప్రమాదాలకు సంబంధించి ఆర్టీసీ అద్దె బస్సుల యజమాని ఒక్కరే కావడం విచిత్రం.

పుట్టిన రోజు నాడే బాలుడి అంత్యక్రియలు

- వేడుకలు జరిపేందుకు కేరళ వెళ్లిన కుటుంబ సభ్యులు
- ప్రమాదవశాత్తు స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి
- చిలప్‌చెడ్ మండలంలో విషాదం



నవీన్‌రెడ్డి (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆనందంగా జరగాల్సిన ఆరేళ్ల బాలుడి పుట్టిన రోజు వేడుకలకు బదులుగా అంత్యక్రియలు జరిగాయి. బర్త్ డే వేడుకలు జరుపుకోవడానికి కుటుంబ సభ్యులు కేరళకు వెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనతో సిద్దిపేట జిల్లా చిలప్‌చెడ్ మండలంలో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కొండారెడ్డిగారి దిలీప్ రెడ్డి, చందనల కుమారుడు నవీన్‌రెడ్డి(6) పుట్టిన రోజు ఆదివారం ఉంది. బాలుడి జన్మదిన వేడుకలు కేరళలోని వయనాడ్‌లో చేసేందుకు తల్లిదండ్రులు, మిగితా కుటుంబ సభ్యులు 23న విహారయాత్రకు వెళ్లారు. శనివారం వయనాడ్‌లో ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి నవీన్‌రెడ్డి మృతి చెందాడు. ఆదివారం ఉదయం బాలుడి మృతదేహం కుటుంబ సభ్యులు చిట్కుల్ చేరుకోగానే బంధువులు, గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా జరగాల్సిన నవీన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు, అదే కుటుంబ సభ్యుల రోదనలతో అంత్యక్రియలు జరిగాయి. పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి బాలుడికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.



విజేతకు నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

– ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, తల్లిదండ్రులు సహకారం అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ బాలాజీ ఫంక్షన్ హాలులో వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెంచ్ ప్రెస్ పవర్ లిఫ్ట్ రాష్ట్ర స్థాయి ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీలకు పటాన్ చెరు వేదికగా నిలవడం సంతోషకరమన్నారు. బాల్యం నుంచే పిల్లలకు క్రీడలపై ఆసక్తి పెంచాలన్నారు. అనంతరం విజేతలకు సొంత నగదు రూ.2 లక్షలతో బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహ గౌడ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, అరవ రామకృష్ణ, వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు రేణుక, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

నమాజ్ కోసం వెళ్లి బాలుడు అదృశ్యం



బాలుడు హమీద్

పటాన్‌చెరు టౌన్: బాలుడు అదృశ్యమైన ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్‌కి చెందిన హమీద్(11) శనివారం నమాజ్‌కి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బాలుడి కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. బాలుడి అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి మహిళ



కల్యాణి

శివ్వంపేట(నర్సాపూర్): మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధి చండీ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన సందిగాని కల్యాణికి ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాదిగా చండీ గ్రామంలోని అమ్మగారి ఇంటి వద్ద ఉంటుంది. 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిన కల్యాణి తిరిగిరాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గ్రామ పరిసరాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లి కుదరడం లేదని యువకుడి ఆత్మహత్య



బాలరాజు (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గాగ్గిళ్లపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబుబ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోడపట్ల బాలరాజు(29) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్లుగా బాలరాజుకు కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నప్పటికీ ఎక్కడా కుదరకపోవడంతో మానసింగా కుంగిపోయి మద్యానికి బానిసయ్యాడు. 23న తమ్ముడు బోడపట్ల రాజేందర్‌కి పెళ్లి కావడంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంటుబ సభ్యులు చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో వివాహిత

కొండపాక(గజ్వేల్): ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లికి దున్నపోతుల కలవ్వ (36) కొన్నేళ్ల కిందట భర్తతో విడాకులు తీసుకుంది. కూతురు, కొడుకుతో కలిసి కోనాయిపల్లిలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. 26న రాత్రి తల్లి కిష్టవ్వ, పిల్లలతో కలిసి భోజనం చేసి వేసవి కాలంలో కావడంతో అందరూ కలిసి ఇంటి బయట నిద్రించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కలవ్వ మనస్తాపానికి గురై రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో ఇంట్లోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తమ్ముడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అయ్యో ట్రాన్స్‘ఫార్మర్లు’

- రాయపోలు మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు
- కరువు కాలంలో ఇదేందని రైతుల ఆందోళన

దుబ్బాకటౌన్ : అసలే ఎండలు మండుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు నీళ్లు అందక రైతులు నానా తంటాలు పడుతున్నారు. దీనికి తోడు రాయపోల్ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాయిల్స్ దొంగిలించడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

కాయిల్స్ దొంగిలించి

రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి మల్కాపూర్ రోడ్డులోని రైల్వే బ్రిడ్జి వద్ద గల వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి దానిలోని కాయిల్స్, ఆయిల్ ను దుండగులు ఎత్తుకెళ్లారు. గమనించిన రైతులు పోలీసులకు విద్యుత్, అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ. 50 వేల విలువ గలవి ఎత్తుకెళ్లారని విద్యుత్ అధికారులు చెప్పారు. పంటలు చివరి దశకు వచ్చాయని ఈ సమయంలో నీటిపారుకం ఎంతో అవసరమని రైతులు రోదిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




దొంగలు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

గతంలో దొంగల ముఠా అరెస్టు

ఐదు నెలల కిందట రాయపోల్ మండల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగిలించిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను తొగుట సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో రాయపోల్ పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. అయినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు ఆగకపోవడంతో రైతులు భయందోళనకు గురవుతున్నారు.

వ్యవసాయం చేసేదెట్లా..



ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు రైతులను ఆగమాగం జేస్తుర్రు. నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి. ఉన్న నీళ్లతో పంట పండిదామంటే ఇప్పుడు కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇట్లయితే వ్యవయసాయం ఎట్లా చేయమంటారు. అధికారులు దొంగలను పట్టుకోవాలి.

– నిరుడి మల్లమ్మ, మహిళా రైతు